క్లుప్తంగా

వాహనాల తనిఖీ

చండ్రుగొండ: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు బుధవారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సులు మినహాయించి ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాచినేని రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ర్యాలీలు, సభలకు అనుమతి తీసుకున్నప్పటికీ నిబంధనలు ఉల్లఘించే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.

జెడ్పీటీసీతో ఎమ్మెల్యే సమావేశం


చండ్రుగొండ: జెడ్పీటీసీ వెంకటరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

చండ్రుగొండ: బీఆర్ఎస్ పార్టీ కుటుంబం వంటిదని, నాయకుల మధ్య విభేదాలు ఉన్నా సర్దుకుంటామని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరనున్న సందర్భంగా బుధవారం ఆయన ఇంటికి ఎమ్మెల్యే వచ్చారు. జెడ్పీటీసీ గడిచిన ఎన్నికల్లో పొత్తులో భాగంగా తన విజయానికి సహకరించారని గుర్తు చేశారు. అనంతరం జెడ్పీటీసీ గురువారం బీఆర్ఎస్‌లో చేరుతున్న సందర్భంగా సభ నిర్వహించే స్థలాన్ని ఎమ్మెల్యే మెచ్చా పరిశీలించారు. నాయకులు దార యుగేందర్, దార వెంకటేశ్వరరావు, ఎస్‌డి.రసూల్, సీహెచ్.రామరాజు, ఉప్పతల ఏడుకొండలు, సూరా వెంకటేశ్వర్లు, సర్పంచ్ పూసం వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయకుడితో..

దమ్మపేట: ఇటీవలే వైఎస్సార్ తెలంగాణ పార్టీకి రాజీనామా ప్రకటించిన ఆదివాసీ నాయకుడు సోయం వీరభద్రంను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కలిశారు. బుధవారం మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామంలోని నివాసంలో కలిసి తాజా రాజకీయ పరిస్థితులపై కాసేపు ముచ్చటించారు. ఈ భేటీలో సోయాన్ని బీఆర్ఎస్‌లో చేరమని ఎమ్మెల్యే కోరినట్టు సమాచారం. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, సోయం రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కుట్ర

మణుగూరుటౌన్: లాభాల వాటా, దసరా అడ్వాన్సులు ఎన్నికల కోడ్‌కు ముడి పెట్టి నిలిపివేయడం, దానిపై టీబీజీకేఎస్ మాట్లాడి ఇప్పించినట్లు చేయడం యాజమాన్యం చేస్తున్న కుట్ర అని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సారి ఇచ్చే లాభాల వాటా, పండుగ అడ్వాన్సులు తక్షణమే చెల్లించకుంటే శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమంతో పాటు 21న టోకెన్ సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మల్లెల రామనర్సయ్య, ఆవుల నాగరాజు, అబ్దుల్ సుభానీ, కోడిరెక్కల శ్రీనివాసరావు, సాయి ప్రకాశ్ చారి, అంథోని రవి తదితరులు ఉన్నారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

బూర్గంపాడు: యువత క్రీడానైపుణ్యాలను మెరుగుపరుచుకుని క్రీడాపోటీలలో సత్తా చాటాలని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని చెరువుసింగారం గ్రామానికి చెందిన గొత్తికోయ యువతకు బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా యువత సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగభిక్షం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ దేవరపు వెంకటయ్య(80) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు వెంకటయ్య యాదవ సంఘం నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా సుపరిచితుడు. వెంకటయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలు పార్టీలు, యాదవ సంఘం నాయకులు వెంకటయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు.

వైద్యానికి వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక బంజర గ్రామానికి చెందిన తడికెల చంద్రం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా.. భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఫౌండేషన్ సభ్యులు సోమయ్య, ప్రదీప్, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలే.. కానీ ఎస్టీలు కాదట!

- వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్ల నిరాకరణ
- ఏళ్లుగా నానుతున్న సమస్య
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్న గిరిజనం
- యువత చదువులకు తప్పని అడ్డంకులు


ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని చర్లలో ర్యాలీ తీస్తున్న ఆదివాసీలు (ఫైల్)

చర్లరూరల్: అడవినే నమ్ముకుని, అడవిలో జీవిస్తున్న ఆదివాసీలు గిరిజనుల గుర్తింపును కోల్పోతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన వీరికి ఇక్కడి ప్రభుత్వం ఎస్టీ సర్టిఫికెట్లు నిరాకరించింది. చర్ల మండలంలోని అటవీప్రాంతంలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్నప్పటికీ గిరిజనులుగా గుర్తించకపోవడంతో వీరు ఆర్థికంగా వెనుకబడిపోతున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. కాస్ట్ సర్టిఫికెట్ లేక తమ పిల్లలు చదువులకు దూరమవుతున్నారు. ఎన్నోసార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ వారి సమస్యను పరిష్కరించిన నాథుడు లేడు.

ఎన్నో ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన వీరు చర్ల మండలంలోనే స్థిరపడి దొరికిన పని చేసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం రేషన్, ఆధార్ వంటి గుర్తింపు కార్డులను మంజూరు చేసింది. స్థానికల్లో ఒకరిగా దాదాపు గుర్తింపుపొందారు. కానీ కాస్ట్ సర్టిఫికెట్ల విషయానికి వస్తే ఛత్తీస్‌గఢ్‌లో వీరు మరియ తెగకు చెందిన బీసీలుగా ఉన్నారని, స్థానికంగా ఎస్టీలుగా గుర్తించడం చట్ట ప్రకారం కుదరదని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

దీనివల్ల గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతున్నప్పటికీ.. అవేవి ఇక్కడి ఆదివాసీలకు అందడం లేదు. వీరి పిల్లలు కూడా ఎస్టీ విద్యార్థులుగా ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందకపోవడం వల్ల వారికి అందాల్సిన లబ్ధి చేకూరడం లేదు. కొందరికి కనీసం ఏదో ఓ కులం పేరిట అయినా సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో కులధ్రువీకరణ పత్రం లేని కారణంతో చదువులకు దూరమవుతున్నారు. ఈ సమస్యపై ఆదివాసీ నాయకులు ఆధ్వర్యంలో పలుమార్లు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. రాజకీయ పార్టీల సారథ్యంలో నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు. అయినా సమస్యలకు పరిష్కారం దొరకలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఎస్టీలను గుర్తించాలని, ఆ మేరకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని వలస ఆదివాసీలు వేడుకుంటున్నారు.

ఎస్టీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు

చర్ల: మూడు దశాబ్దాల కాలంగా తెలంగాణాలోని అటవీ ప్రాంతాల్లో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు ఎస్టీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ నుంచి పొట్ట చేతపట్టుకుని 3 వేలకు పైగా కుటుంబాలు తెలంగాణకు వలస వచ్చాయని, వీరికి ఎస్టీ కుల ధ్రువపత్రాలిచ్చేందుకు ప్రభుత్వం, అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఆదివాసీల పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ జాబితాలో గోండు కులాన్ని చేర్చి గెజిట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మాజీ ఎంపీటీసీ సభ్యులు తెల్లం లక్ష్మీనారాయణ, సర్పంచ్ కారం సమ్మయ్య, మాజీ సర్పంచ్ నూపా తిరుపతిరావు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులుగా గుర్తించాలి



అడవి ప్రాంతంలో నివసించే ఆదివాసీలను గిరిజనులుగా గుర్తించాలి. ఎన్నో తరాలుగా అడవితల్లినే నమ్ముకుని జీవిస్తున్న వలస ఆదివాసీలను విస్మరిస్తే సహించేది లేదు.

– హేమ సుందర్, రాష్ట్ర కార్యదర్శి, ఏపీఎస్పీ

ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



ఇక్కడ నివసించే వలస ఆదివాసీలకు ఓటరు కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఇచ్చినపుడు ఖచ్చితంగా ఎస్టీ సర్టిఫికెట్లు కూడా ఇచ్చితీరాలి.

– పాయం సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, గోండ్వానా సంక్షేమ పరిషత్

నిబంధనలు ఒప్పుకోవు..



ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఆదివాసీలను ఇక్కడ గిరిజనులుగా గుర్తించలేము. ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వడం కుదరదు. అందుకు నిబంధనలు ఒప్పుకోవు.

– అనంత రామయ్య, తహసీల్దార్, చర్ల

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పెదిగూడెం పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

దుమ్ముగూడెం: పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలూ ఏర్పాటు చేయాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని తూరుబాక, సీతానగరం, గౌరారం, కొత్తపల్లి, పైదిగూడెం పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్ట్ ప్రభావిత, వివాదాస్పద ప్రాంతాలలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఏఎస్పీ వెంట సీఐ దోమల రమేష్, ఎస్సై కేశవరావు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో వైద్యశిబిరం


అశ్వారావుపేటరూరల్: వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు మధుళిక


మణుగూరురూరల్: పల్లె దవాఖానాలో మందులు పరిశీలిస్తున్న డాక్టర్ శివకుమార్

చండ్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామశివారు కనకగిరి అటవీప్రాంతంలోని ఎర్రబోడులో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కనకం తనుజా ఆధ్వర్యంలో ఆదివాసీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ఇమాం, సిబ్బంది ఎ.శ్రీను, సుజాత, రాజేశ్వరి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని విప్పలసింగారం గ్రామపంచాయతీ చెరువుముందు సింగారం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. జ్వరపీడితుల రక్తన మూనాలను సేకరించి జాగ్రత్తలు సూచించారు. అనంతరం కూనవరం పల్లె దవాఖాను సందర్శించి రికార్డులను, ఫార్మసీ మందులను పరిశీలించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, పగిడమ్మ, రవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలంలోని క్రాంతిపురం, రాజయ్యనగర్‌లలో నివసించే గిరిజనుల కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించింది. 60 మందికి కొయ్యూరు వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సంపత్‌లు వైద్య చికిత్సలు నిర్వహించి రోగులకు అవసరమయ్యే మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్‌టీలు రవి, గోపి హెల్త్ సూపర్ వైజర్ ప్రసాద్, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

6 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుమూల, దట్టమైన అటవీ ప్రాంతంలోని జిల్లేడుబాక గొత్తికోయల గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మధుళిక, తన సిబ్బందితో కలిసి రహదారి మార్గం లేకపోవడంతో ఆరు కిలోమీటర్ల దూరం వరకు కాలినడకన వెళ్లారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి 47 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. వారిలో ఏడుగురు జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. వారికి రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ దుర్గమ్మ, హెల్త్ సూప్‌వైజర్ పీ కృష్ణయ్య, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం సీహెచ్ విజయకుమారి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

హోమియోపతి వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల హోమియోపతి వైద్య డాక్టర్ రాజేష్ బాబు ఆధ్వర్యంలో చిన్ననల్లబల్లి గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి పరీక్షలు నిర్వహించి హోమియోపతి వైద్యం గురించి అవగాహన కల్పించారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌ఓ మోహబుబ్,ఆశా వర్కర్లు వెంకటలక్ష్మి, స్వరూప, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు


అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేష్


భద్రాచలంఅర్బన్: రాజకీయ నాయకులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ చంద్రశేఖర్

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు ఏలాంటి విఘాతం కల్పించవద్దని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ అన్నారు. స్థానిక రైతు వేదికలో బుధవారం ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నేతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని, ఆయా అనుమతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సువిధ యాప్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఘర్షణలు, వివాదాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా ఏపీ, తెలంగాణకు రాకపోకలు సాగించే ప్రధాన మార్గాల్లో ఇప్పటికే చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్సై పీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి

అశ్వాపురం: మండలంలో నవంబర్ 30న జరిగే ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని అశ్వాపురం సీఐ జి.రవీందర్ కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన ఎన్నికల నిబంధనలపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఐ రవీందర్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి, ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, సోషల్ మీడియా మీద పోలీస్‌శాఖ నిఘా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాద్, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం భద్రాచలం పట్టణానికి చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో అసెంబ్లీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయ డీఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ప్రచారానికి వాహనాలు వినియోగిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మణికంఠ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల నియమావళి పాటించాలని ఎస్సై సాయికిషోర్ రెడ్డి సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలపరిధిలోని పూసుగూడెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ.. సభలు, సమావేశాలకు పోలీస్‌శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రజలు గుంపులు, గుంపులుగా సంచరించకూడదని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.

కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లు అందజేస్తున్న సంస్థ బాధ్యులు

ములకలపల్లి: అప్పీల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లను వితరణగా అందజేశారు. మండలకేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, సింగరేణి సూపరింటెండెంట్ ఇంజనీర్ గోళ్ల రమేశ్ ఇరువురు మహిళలకు వీటిని పంపిణీ చేశారు. ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, మాజీ జెడ్పీటీసీ బాబూరావు, గ్రామపెద్దలు పెద్దవెంకన్న, సీతారాములు, యాదగిరి పాల్గొన్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు

నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో బుధవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కాలేజీలకు నేటి నుంచి 25 తారీఖు వరకు దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో గురువారం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థినులు అందమైన బతుకమ్మలను తయారుచేసుకుని రాగా.. అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మల పాటలకు చిందులేస్తూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరురూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు..


అశ్వారావుపేటరూరల్: వీకేడీవీఎస్ కళాశాలలో..


దుమ్ముగూడెం: బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు

డిజిటల్ చెల్లింపులే ఆమోదయోగ్యం


డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

అశ్వారావుపేటరూరల్: వినియోగదారులు డిజిటల్ విధానంలో కరెంట్ బిల్లులను చెల్లించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ట్రాన్స్‌కో ఎస్ఈ కె.రమేష్, డి.నందయ్య ఆదేశాల మేరకు బుధవారం వినియోగదారులకు ఫోన్, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు ద్వారా కరెంట్ బిల్లులను చెల్లించే విధానం, పద్ధతుల గురించి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. వినియోగదారులు డిజిటల్ విధానంలో బిల్లులను చెల్లించడం ఇబ్బందులు ఉండవని, డిజిటల్ చెల్లింపుల ద్వారా వినియోగదారులకు ఏలాంటి నష్టం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ డి.శరత్‌కుమార్, సబ్ ఇంజనీర్ ఎం.శివ శంకర్, సిబ్బంది గోపాల్, నాగు పాల్గొన్నారు.

మహాలక్ష్మి రూపిణికి పూజలు

మణుగూరురూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో, మండపాల్లో అమ్మవారు నాలుగో రోజు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పట్టుచీరెలతో, పూలతో, ఆభరణాలతో అర్చకులు సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం పసుపు, కుంకుమలు, పూలతో అర్చకులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని శ్రీగాయత్రి ఆశ్రమంలో బుధవారం అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలను ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తిజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంను నిర్వహించారు.

అశ్వారావుపేటరూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. మండల పరిధిలోని కొత్త మామిళ్లవారిగూడెం, నారంవారిగూడెం కాలనీలోని విజయభవాని అమ్మవారి ఆలయంలో, వినాయకపురం, నారాయణపురం, అశ్వారావుపేటలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు, రుద్రాభిషేకాలు, నవదుర్గార్చన, మండపారాధన చేశారు. అదే విధంగా కొత్త మామిళ్లవారిగూడెంలో అమ్మవారిని కరెన్సీ నోట్ల దండలతో అలంకరించారు.


మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న అమ్మవారు


అశ్వారావుపేటరూరల్: కొత్త మామిళ్లవారిగూడెంలో కరెన్సీ నోట్ల మాలలతో అమ్మవారు..

అన్నపూర్ణేశ్వరిగా..

భద్రాచలంఅర్బన్: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కుబడులను తీర్చుకున్నారు.

ధనలక్ష్మిగా..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో భక్తులు దర్శనమిచ్చారు. శివాలయంలో కొలువుదీరిన అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. మండలంలో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

లలితాదేవిగా..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారిని లలితాదేవి అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు తెల్లవారుజామున కనకదుర్గమ్మ వారికి విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం లలితాదేవి అవతారంలో అలంకరించి కుంకుమ పూజార్చన చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మహిళ భక్తులు భారీగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.